అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్‌: నాచారం డివిజన్‌ పరిధిలోని రాఘవేంద్రనగర్‌, రాజీవ్‌నగర్‌ కాలనీలో రూ.52 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు సోమవారం స్థానిక కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాఘవేంద్రనగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషిచేసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. జలమండలి మేనేజర్‌ సిరాజుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: అల్వాల్‌ డివిజన్‌ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అల్వాల్‌ డివిజన్‌లోని ఆదర్శనగర్‌లో రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.10 లక్షలతో బాక్స్‌ డ్రైనేజీని సోమవారం ఆయన కార్పొరేటర్‌ శాంతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. స్థానిక నేతలు రమేష్‌, రాజేష్‌గౌడ్‌, శరణగిరి, సాజిద్‌, విజయశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ నూతన కార్యవర్గం



అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ శ్రీసాయి సూర్య లోటస్‌ పాండ్‌ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజుగౌడ్‌, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌రెడ్డి, కోశాధికారిగా శ్రావణ్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి, కార్యనిర్వాహకులుగా నారాయణరెడ్డి, సతీష్‌, ప్రణయ్‌గౌడ్‌, సత్యనారాయణలు ఎన్నికయ్యారు.

వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ



మల్లాపూర్‌: భవన కార్మిక జేఏసీ కన్వీనర్‌ బోడ్డు శివ ఆధ్వర్యంలో రూపొందించిన జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మె బంద్‌ పోస్టర్‌ను సోమవారం నాచారం కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌, జేఏసీ సంస్థల ఫౌండర్‌ నల్లా రాధాకృష్ణ, మాజీ కౌన్సిలర్‌ రామ్‌ కోటేశ్వర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. విజయ్‌కుమార్‌, కరాటే శ్రీరామ్‌, రాజబాబు, గద్ద యుగేందర్‌, అంజి, వీరన్న, సైదులు, వెంకన్న, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రామంతాపూర్‌ : జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా సోమవారం రామంతాపూర్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. హోమియోపతి వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్‌ మాట్లాడుతూ.. తమ విద్యార్థి సంఘం కేవలం ధర్నాలు, రాస్తారోకోలే కాకుండా దేశంలోనే అతిపెద్ద సేవా భావజాలాలు కలిగిన ఏకైక విద్యార్థి సంస్థ అని కొనియాడారు. ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రి సూపరింటెండెంట్‌ సౌమ్యా పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ వినయ్‌కుమార్‌, సమితి సభ్యులు శ్యామ్‌కిరణ్‌, అఖిల్‌, క్రిష్‌ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌, శివసాయినగర్‌లో భారీ మర్రిచెట్టు, తాటిచెట్టు నరికివేతపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌ కార్యాలయంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీసీఎస్‌ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, అశోక్‌, సత్యనారాయణ, ఉపేందర్‌, శారదాంబ, సరోజిని, వరలక్ష్మి, రాధిక, సుశీల, శైలజ, విజయ, వాణి తదితరులు పాల్గొన్నారు.

కడసారి చూసేందుకొస్తే..

కనీస సౌకర్యాలేవి?



రామంతాపూర్‌లోని శ్మశానవాటికల దుస్థితి

- మందుబాబులకు అడ్డాలుగా మారిన వైనం
- ఆత్మీయుల కడచూపు కోసం వస్తే అన్ని ఆగచాట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రామంతాపూర్‌: మన ఆప్తులు, బంధుమిత్రులు మరణించినప్పుడు వారి పార్థివదేహానికి కడసారి కన్నీటివీడ్కోలుతో అంత్యక్రియలు నిర్వహించడానికి రామంతాపూర్‌ రాజేంద్రనగర్‌, నేతాజీనగర్‌లో ఉన్న రెండు హిందూశ్మశానవాటికలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 150 కాలనీలు, బస్తీల ప్రజలు వినియోగించే ఈ రెండు శ్మశానవాటికల్లో సమస్యల కారణంగా కాచిగూడ, మల్లాపూర్‌ శ్మశానవాటికలకు తీసుకెళ్తున్నారు.

శ్మశానవాటికల్లో నెలకొన్న సమస్యలు..

రాజేంద్రనగర్‌ హిందూ శ్మశానవాటిక దాదాపు రెండెకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ శ్మశానవాటికకు ఒక పక్క ఉన్న ప్రహరీ పాక్షికంగా కూలిపోవడంతో ఆ గోడ దూకి మందుబాబులకు అడ్డగా మారుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

కూర్చునేందుకు వీలులేదు..

కనీసం కూర్చుకునేందుకు సౌకర్యాలు లేకపోవడంతో సమాధుల మీదే కూర్చుంటున్నారు. ఎన్నో ఏళ్ల కింద నిర్మించిన స్నానపు గదులు, వాష్‌రూమ్‌లను సరైన నిర్వహణ లేకపోవడంతో అవి మురికికూపంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. దహన వాటికలపై తెరచి ఉండటంతో వర్షాలు పడినప్పుడు దహన సంస్కారాలకు అంతరాయం కలుగుతుంది.

నేతాజీనగర్‌ శ్మశానవాటిక..

ఇది దాదాపు మూడెకరాల విస్తీర్ణంలో ఉంది. గతంలో సుమారు రూ.90 లక్షలతో నిర్వహించిన అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో వాటి నిర్వహణ పర్యవేక్షణ సరైన పద్ధతిలో చేయకపోవడంతో అవి పనికిరాకుండా పోయాయి. శ్మశానవాటికకు అనుకుని ఉన్న ఇళ్ల నుంచి స్థానికులు కొంతమంది తమ ఇంట్లోని చెత్త, చెదారాన్ని ఈ శ్మశానవాటికలో వేస్తున్నారు.

ఎటుచూసినా వ్యర్థాలే..

శ్మశానవాటికలో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఏటు చూసినా పిచ్చిమొక్కలు, పొదలతో విస్తరించి ఉండటం వల్ల పండుగ రోజుల్లో తమ పూర్వీకుల సమాధుల వద్దకు చేరుకుని శ్రద్ధాంజలి ఘటించుదామనుకునే వారికి నిరాశే ఎదురవుతుంది.

బస్తీవాసులకు ఇబ్బంది..

దహన వాటికల్లో పైకప్పు తెరిచి ఉండటం వల్ల దహనసంస్కారాలు నిర్వహించేటప్పుడు వచ్చే పొగ పక్కనున్న బస్తీల్లోకి, కాలనీలోకి వ్యాపించి ఇబ్బందులకు గురి చేస్తుంది.

నిధుల కేటాయింపు శూన్యం..

ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలోని చిలుకానగర్‌ డివిజన్‌లో ఉన్న శ్మశానవాటిక అభివృద్ధికి ఇటీవల ఉప్పల్‌ సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ అధికారులు రూ. 3 కోట్లు కేటాయించారు. ఎన్నో ఏళ్లగా స్థానికులు రామంతాపూర్‌లోని హిందూ శ్మశానవాటికలను అభివృద్ధి చే యాలని కోరుతూ పలుసార్లు వినతిపత్రాలు అందించినా జీహెచ్‌ఎంసీ అధి కారులు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు పట్టించుకుని ఈ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

బస్తీలోకి విష పురుగులు వస్తున్నాయి



నేతాజీనగర్‌, రాజేంద్రనగర్‌లో ఉన్న హిందూ శ్మశానవాటికల్లో పెరిగిన చెట్ల పొదలతో శ్మశానాలను ఆనుకుని ఉన్న బస్తీలు, కాలనీల్లోకి పాములు, ఇతర విష కీటకాలు వస్తున్నాయి. ఈ చెట్ల పొదలను తొలగించాలి. రెండు శ్మశానవాటికల్లో దహనవాటికలపైన ఎలాంటి పొగ గొట్టాలు లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేటప్పుడు వచ్చే పొగ బస్తీలు, కాలనీల్లోకి వ్యాపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దహన వాటికలపై పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలి.

– పవన్‌, నేతాజీనగర్‌

మోడల్‌ శ్మశానవాటికలా అభివృద్ధి చేయాలి



రామంతాపూర్‌లో ఉన్న రెండు హిందూ శ్మశానవాటికల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడానికి నిధులు విడుదల చేసి అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్‌ శ్మశానవాటికల్లా అభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

– మహేందర్‌, పూలే సేవా సంఘం అధ్యక్షుడు

శ్మశానవాటికల్లో అంధకారం



రాజేంద్రనగర్‌ శ్మశానవాటికలో ఇటీవల విద్యుత్‌ స్తంభాలు ఏర్పాటు చేశారు. కానీ వాటికి దీపాలు (విద్యుత్‌ బల్బులు) అమర్చలేదు. అదే విధంగా నేతాజీనగర్‌ శ్మశానవాటికలో విద్యుత్‌ దీపాలు ఎక్కువగా లేకపోవడంతో సాయంత్రం జరిగే అంత్యక్రియలు అంధకారంలోనే కొనసాగిస్తున్నారు. వెంటనే అధికారులు విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేయాలి.

– లక్ష్మణ్‌, ఓల్డ్‌ రామంతాపూర్‌

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్‌ 11 కేవీ గణేష్‌టెంపుల్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 11 కేవీ బీజేఆర్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీజేఆర్‌నగర్‌, సత్తిరెడ్డినగర్‌, సత్యరాఘవేంద్రకాలనీ, పీవీఎస్‌ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ గోపాల్‌ తెలిపారు.

రామంతాపూర్‌ : విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని గణేష్‌నగర్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఓల్డ్‌ రామంతాపూర్‌, న్యూ రామంతాపూర్‌ తదితర ప్రాంతాలు, విద్యుత్‌ స్పీకర్‌ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురానగర్‌, ఈస్ట్‌ శ్రీనివాసపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

బోడుప్పల్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో మంగళవారం విద్యుత్‌ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్‌ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఉదయ్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

మల్లాపూర్‌: మల్లాపూర్‌ ఛండీయానగర్‌ కాలనీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా బండి లింగం, ప్రధాన కార్యదర్శిగా సింగారపు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మహేందర్‌గౌడ్‌, సంయుక్తకార్యదర్శిగా బీరప్ప, కోశాధికారిగా శ్రీకాంత్‌, కార్యనిర్వాహక కార్యదర్శిలుగా ప్రశాంత్‌, ప్రతాప్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా మల్లేష్‌, కాటమయ్య, కమిటీ సభ్యులుగా కృష్ణ, సతీష్‌రెడ్డి, యాదగిరి, శ్రీరాములు, భాస్కర్‌, నందు, రమేష్‌గౌడ్‌, శివ, అయిలయ్య, నర్సింహ, భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

భరోసా కల్పించేలా పాలన సాగిస్తాం



సమావేశంలో ఐలా చైర్మన్‌ గోవిందారెడ్డి, సీఐఏ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఐలా, సీఐఏ నూతన చైర్మన్‌, అధ్యక్షుడు

కుషాయిగూడ: పారిశ్రామికవేత్తలు, కార్మికులు, ఉద్యోగులకు భరోసా కల్పించేలా పాలన సాగిస్తామని నూతనంగ ఎన్నికైన ఐలా చైర్మన్‌ గోవిందారెడ్డి, సీఐఏ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నూతన కమిటీ ఎన్నికై న సందర్భంగాసోమవారం సీఐఏ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అనుభవజ్ఞులైన పారిశ్రామికవేత్తల సహకారంలో అవినీతికి తావులేకుండా చర్లపల్లి పారిశ్రామికవాడను అభివృద్ధి పథంలో నిలిపేందుకు తమ శాయశక్తుల కృషి చేస్తామన్నారు.

- ప్రతి ఏటా చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమంపై కేలండర్‌ ఆఫ్‌ ఈవెంట్‌ను రూపొందిస్తామన్నారు. కార్మికుల కోసం హెల్త్‌క్యాంపులు, హస్టల్‌ నిర్మాణాలు, చైల్డ్‌కేర్‌ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రభుత్వం, పోలీసుల సహకారంతో కట్టుదిట్టమైన భద్రత, రక్షణచర్యలు అమలయ్యేలా చూస్తామన్నారు.

హైటెక్‌ తరహాలో కన్వెన్షన్‌..

స్కిల్‌ డెవలప్‌మెంట్‌, ఈఎస్‌ఐ, జీఎస్‌టీ వంటి కేంద్ర,రాష్ట్ర కార్యక్రమాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమాలను చేపట్టి వారిని ఎప్పటికప్పుడు అవేర్‌ చేస్తామని, హైటెక్‌ తరహాలో కన్వెన్షన్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకుల నుంచి ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం, ఫైనాన్షియల్‌ హెల్త్‌ క్లినిక్‌ కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి పారిశ్రామికవేత్తల ఉత్పత్తులకు మార్కెటింగ్‌ సదుపాయాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.

- మహిళ పారిశ్రామికవేత్తలతో గ్రూప్‌ ఏర్పాటు చేసి మహిళా కార్మికుల అవసరాలను గుర్తించి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఐలా వైస్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌, సెక్రటరీ రాఘవయ్య, జాయింట్‌ సెక్రటరీ సురేష్‌, ట్రెజరర్‌ మల్లికార్జున్‌రెడ్డి, సీఐఏ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ పీ.ఎస్‌. మోహన్‌, జాయింట్‌ సెక్రటరీ గంగాధర్‌బాబు, ట్రెజరర్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



కార్పొరేటర్‌ సునీతకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి: డివిజన్‌లోని పలు కాలనీ అధ్యక్షులు, కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్‌ సునీతను కలిసి ఆయా కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. పీబీ కాలనీలో విద్యుత్‌ స్తంభాలు, వీధిదీపాలు ఏర్పాటు, సూర్యనగర్‌ కాలనీలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె ఎంపీ, ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని వివరించారు. అనంతరం కాలనీవాసులు కార్పొరేటర్‌ను సన్మానించారు. పీబీ కాలనీ ప్రెసిడెంట్‌ గోపాల్‌గౌడ్‌, శంకర్‌, మల్లికార్జున, డివిజన్‌ ప్రెసిడెంట్‌ శివగౌడ్‌, శ్రీనివాస్‌యాదవ్‌, నటరాజ్‌, రేఖ,రమణ, వెంకటరమణ బీరప్ప, భబిత, లలిత, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్‌

కుషాయిగూడ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా, నేతాజీనగర్‌ చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా.. స్కూటీపై వచ్చిన ఇద్దరు యువకులు పోలీసులను చూసి పారిపోతుండగా.. గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తనిఖీలు నిర్వహించగా.. స్కూటీలో 3 కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయినీ స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులు జవహర్‌నగర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్‌ వెంకటేష్‌, కాప్రా, ప్రథమపురి కాలనీకి చెందిన డ్రైవర్‌ ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

చక్రిపురం కాలనీ నూతన కార్యవర్గం



కుషాయిగూడ: చక్రిపురం కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడిగా గడ్డల పాండు, ప్రధాన కార్యదర్శిగా సోమసారి అశోక్‌ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో వారితో పాటు ఉపాధ్యక్షులుగా కొండారెడ్డి, లాల్‌సింగ్‌, సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్‌రెడ్డి, ఎర్రయ్య, కోశాధికారిగా జగన్మోహన్‌రెడ్డి, ఉప కోశాధికారిగా యాకయ్య, ఆర్గనైజింగ్‌ సెక్రటరీలుగా చంద్రారెడ్డి, బ్రహ్మచారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. అందరి సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులను అభినందించి ఘనంగా సత్కరించారు.

ప్రజావాణికి స్పందన కరువు !

ఉప్పల్‌: ఉప్పల్‌ సర్కిల్‌ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వ ఆశయాలకు భిన్నంగా ఉండటంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో వినిపించిన చిన్న చిన్న సమస్యలను సైతం అధికారులు పరిగణలోకి తీసుకోకపోవడంపై ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా వాణికి కేవలం 3 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. అవి కూడా రాజకీయ పార్టీల నేతలవే కావడం విశేషం. ఇప్పటికైనా అధికారులు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- చిలుకానగర్‌ డివిజన్‌ బీరప్పగడ్డ వెస్‌ కల్చరల్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు బస్తీలో ఓపెన్‌ డ్రెయిన్‌ వేయాలని వినతిపత్రం అందజేశారు.


హైడ్రా కమిషనర్‌ను కలిసిన మసీదు ప్రతినిధులు



రంగనాథ్‌ను కలిసిన మసీద్‌ ప్రతినిధులు

బోడుప్పల్‌: నల్ల చెరువును ఆనుకుని ఉన్న ముస్లిం శ్మశానవాటికకు హద్దులు ఏర్పాటు చేయాలని సోమవారం అలంగిరి మసీద్‌ కమిటీ ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హద్దులు ఏర్పాటు చేస్తే మౌలిక వసతులు ఏర్పాటు చేయించుకుంటామన్నారు. అలంగిరి మసీదు కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్‌ఖాన్‌, ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ అజీఘర్‌, ఉపాధ్యక్షులు యాకుబ్‌, ఇస్మాయిల్‌, ఇమాముద్దీన్‌, మాజీ కార్పొరేటర్‌ సీసా వెంకటేష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్‌ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: పేద విద్యార్థులకు సేవ చేయాలనే భావన గొప్పదని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నోటుబుక్స్‌ పంపిణీ చేశారు. శ్రీనివాస్‌, నాగరాజు, తిరుమలేష్‌, గంప కృష్ణ, అమరకృష్ణ, నర్సింగరావు, నగేష్‌, స్థానిక నేతలు మహేష్‌గౌడ్‌, రాజు, గిరిబాబు, నర్సింహ్మ, బాలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

మల్కాజిగిరి: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. గతనెల 13న గౌతంనగర్‌ వాటర్‌ ట్యాంక్‌ వద్ద అనారోగ్యంతో ఉన్న వృద్ధుడిని గాంధీ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఓ 282ను వెనక్కి తీసుకోవాలి



చర్లపల్లిలో 282 జీఓ పత్రులను కాల్చివేస్తున్న కార్మికులు

సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

మల్లాపూర్‌: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్‌ 282ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గణేష్‌ డిమాండ్‌ చేశారు. నాచారం పారిశ్రామికవాడలో టీఎస్‌ ఫుడ్‌ కాంట్రాక్ట్‌ కార్మికుల ఆధ్వర్యంలో జీవో పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా గణేష్‌ మాట్లాడుతూ.. 8 గంటల పనివిధానాన్ని తొలగించి, 10 గంటల పని విధానానికి జీవో 282 ద్వారా మార్పులు చేయడం కార్మికుల హక్కులకు భంగం కలిగించడమే అని, ఆగ్రహం వ్యక్తం చేశారు. శేఖర్‌రెడ్డి, ఉపేందర్‌, సోమయ్య, బాబు, కవిత, జానకమ్మ, జాన్సీ, నర్సింహరావు, రాజు, సునీల్‌, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో చర్లపల్లి ఎంప్లాయిస్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో కాపీని కాల్చివేసి తమ నిరసనను తెలియజేశారు. ఇండస్ట్రియల్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీనివాసులు, నరసింహ, సంతోష్‌, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌: ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 282 ప్రతులను సోమవారం బోడుప్పల్‌ కార్యాలయం ఎదుట సీపీఎం నేతలు తగులబెట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మేడిపల్లి మండల కార్యదర్శి నన్నపనేని సృజన మాట్లాడుతూ.. కార్మికుల వేతనాలు పెంచకుండా పని గంటలను 8 గంటల నుంచి 10 గంటలకు పెంచడం దారుణమన్నారు. సీఐటీయూ కార్యదర్శులు జంగయ్య, చింతల యాదయ్య, మున్సిపల్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలనర్సింహ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మందకృష్ణ అలుపెరగని పోరాటం

మల్కాజిగిరి: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేశారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. సోమవారం మల్కాజిగిరి చౌరస్తాలో ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మైనంపల్లి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్‌ ప్రభుత్వం కూడా మద్దతు పలికిందని పేర్కొన్నారు. నాయకులు రాంచందర్‌మాదిగ, లక్ష్మణ్‌, శివ, వినయ్‌, మనోహర్‌, కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా సోమవారం హెచ్‌బీకాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలేపాక అంజయ్య జెండాను ఆవిష్కరించారు. నేతలు మల్లేష్‌, యాకుబ్‌, జోసఫ్‌ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీకాలనీలో జెండా ఎగురవేస్తున్న అంజయ్య

వ్యర్థాల డంపింగ్‌ తొలగింపు !

సాక్షి ఎఫెక్ట్‌..

గౌతంనగర్‌: డివిజన్‌ పరిధిలోని మల్లికార్జుననగర్‌ ప్రధాన రోడ్డు, రోడ్‌ నెంబర్‌-9లో స్వచ్ఛ రిక్షా కార్మికులు ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను తీసుకొచ్చి వేరు చేసుకుంటున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు 6 న 'వ్యర్థాల డంపింగ్‌పై చర్యలేవి' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం వ్యర్థాల డంపింగ్‌పై చర్యలు చేపట్టారు. మల్లికార్జుననగర్‌ ఉన్న డంపింగ్‌ వ్యర్థాలను తరలించారు.



వ్యర్థాలను తరలిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి

మల్కాజిగిరి: జిల్లా పరిధిలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వినయ్‌ మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నూతన పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని, దివ్యాంగులకు స్వయం ఉపాధికి అవకాశాలు కల్పించాలని సోమవారం కలెక్టర్‌ను కోరామన్నారు. నర్సింహ, రమేష్‌, రాజిరెడ్డి, లక్ష్మి, రాము పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571